మనం

కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

శనివారం | 17 | అక్టోబర్ | 2026 | పేజీలు 12 | www.manamepaper.com



ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన కీలకం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,అక్టోబర్ 16(మనం ప్రతినిధి) : ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన కీలకమని, 2వ దశ జనాభా గనన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సాంకేతిక సహాయకులు, ఛార్జ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, డిఐఎస్ఓ రాజేందర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యకలాపాలను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించడం, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించడం, ప్రజలకు అందించే సంక్షేమ పథకాల రూపకల్పనకు అవసరమైన గణాంకాలను సిద్ధం చేయడమే ఈ శిక్షణ ..

- మిగతా 2లో..

కరెంట్ కోత ఎత్తి వేయాలని రైతుల ధర్నా

- బిజెపి ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముట్టడి
- ఎండుతున్న పంటలు.. కాలుతున్న మోటార్లు
- రైతులను కాపాడాలని కొయ్యల ఏమాజి డిమాండ్



బెల్లంపల్లి,అక్టోబర్ 16, (మనం న్యూస్) : అప్రకటిత కరెంట్ కోత వల్ల రైతుల పంటలు ఎండుతున్నాయని, లో ఓల్టేజితో పంటలు ఎండుతున్నాయని బిజెపి రాష్ట్ర నేత, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. ఈ రోజు బిజెపి కన్నెపల్లి మండల అధ్యక్షులు ఆశన్న ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముట్టడించి ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది కొయ్యల ఏమాజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్రకటితంగా కరెంట్ కోత విధిస్తున్నదని, దీనివల్ల రైతుల పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హై ఓల్టేజ్, లో ఓల్టేజ్ వల్ల రోజూ రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు కాలి పోతున్నాయని, దీని వల్ల రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు విద్యుత్ కోతలు లేవని రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామ స్థాయిలో.. - మిగతా 3లో..



ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజం...

సింగరేణిని సంక్షోభంలోకి తెచ్చి.. తెలంగాణను చీకట్లోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హుజురాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించలేని పరిస్థితి నెలకొనడం, పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలకు నిదర్శనమని ఆయన అన్నారు.

హుజురాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభం, రైతుల సమస్యలు, సింగరేణి సంస్థ పరిస్థితి, ప్రభుత్వ విధానాలపై పలు ప్రశ్నలు సంధించారు.

రైతులకు కరెంట్ కోతలు.. ఎండిపోతున్న పంటలు

తెలంగాణ రాష్ట్రంలో ఒకప్పుడు రైతులకు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని కౌశిక్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సరైన సమయంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తుంటే, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. - మిగతా 2వ పేజీలో..

యూనిక్ కంపెనీ పేరుతో పెట్టుబడుల మోసం

- ప్రధాన నిందితుడు గుజరాత్‌కు చెందిన రాజ్ కుమార్ రాయ్ అరెస్ట్
- బాధితులు వెంటనే ఫిర్యాదు చేయాలి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



కరీంనగర్, అక్టోబర్ 16(మనం బ్యూరో) : గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌కు చెందిన యూనిక్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజ్ కుమార్ రాయ్ అలియాస్ రాజ్ కుమార్ కైలాష్ రాయ్‌ను పెట్టుబడుల మోసం కేసులో ఆదిలాబాద్ జిల్లా తలమడుగు పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. అధిక లాభాలు, మెచ్యూరిటీ..

ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, అక్టోబర్ 16 (మనం ప్రతినిధి): జిల్లాలో ఈ నెల 21 నుంచి డిసెంబర్ 31 వరకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ మోసాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్‌తో కలిసి అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, బ్యాంకు ఖాతాలకు రీ-కేవైసీ, నామినీ నమోదు ప్రక్రియలను పూర్తి చేయించాలని సూచించారు. డిజిటల్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జనగణన మొదటి దశలో భాగంగా గృహాల జాబితా తయారీ, గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్యకు సంబంధించిన వివరాలను సేకరించడం జరిగిందని, 2వ దశలో ప్రతి కుటుంబానికి సంబంధించి మొత్తం 40 ప్రశ్నల ద్వారా అవసరమైన సమాచారాన్ని సేకరించవలసి ఉంటుందని తెలిపారు. త్రాగునీటి సరఫరా, కిరోసిన్ వినియోగం, పక్కా ఇళ్ల వివరాలు తదితర అంశాలపై ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని, సేకరించిన సమాచారం ఆధారంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు రూపొందించడంతో పాటు గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలు, ప్రజా సేవల అభివృద్ధికి సంబంధించిన విధానాలను రూపొందించవచ్చని తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్‌కు ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండాలని, ప్రజలకు సందేహాలు ఉంటే నివృత్తి చేస్తూ సరైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. తొలిసారిగా జనగణన ప్రక్రియను డిజిటల్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు మొబైల్ యాప్ ద్వారా సమాచారాన్ని నమోదు చేయడం జరుగుతుందని, జనాభా గణనకు సంబంధించి 2027 మార్చి 1వ తేదీని సూచన తేదీగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. జనగణనలో భాగంగా 15 రోజుల పాటు స్వీయ గణనకు అవకాశం కల్పించడం జరుగుతుందని, స్వీయ గణన ద్వారా వివరాలు నమోదు చేసిన వారికి ప్రత్యేకంగా కేటాయించిన ఎస్. ఈ. ఐ డి. ఆధారంగా ముందుగా నమోదు చేసిన సమాచారాన్ని పరిశీలించవచ్చని, అనంతరం ఎన్యుమరేటర్ సంబంధిత కుటుంబాన్ని సందర్శించి, నమోదు చేసిన వివరాలను ధ్రువీకరించి, అవసరమైన సవరణలు చేస్తారని తెలిపారు. ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించే ఎన్యుమరేటర్‌తో పాటు సూపర్‌వైజర్, ఛార్జ్ అధికారి స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందని శిక్షణలో వివరించారు. సూపర్‌వైజర్లు యాదృచ్ఛికంగా 20 శాతం వివరాలను తనిఖీ చేస్తారని, ఛార్జ్ అధికారులు తమ లాగిన్‌ల ద్వారా సంబంధిత సమాచారాన్ని పరిశీలించి తప్పులను గుర్తించాలని సూచించారు. ఎన్యుమరేటర్లు జనగణనలోని ప్రతి ప్రశ్నను పూర్తిగా అర్థం చేసుకొని, ప్రజలకు స్పష్టంగా వివరించాలని, 15 రోజుల స్వీయ గణన వ్యవధిలో ఎక్కువ మంది ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. శిక్షణలో ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని, క్షేత్రస్థాయి విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విషయాలను పూర్తిగా నేర్చుకోవాలని తెలిపారు. జనగణనలో ఇండ్లు లేని వ్యక్తులతో సహా అర్హులైన ప్రతి వ్యక్తి వివరాలు నమోదు అయ్యేలా చూడాలని, పునఃపరిశీలన సమయంలో మరణాలు తదితర మార్పులను నిబంధనల ప్రకారం నవీకరించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె. కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్య లు సాంకేతిక సహాయకులు, ఛార్జ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని సంక్షోభంలోకి తెచ్చి.. తెలంగాణను చీకట్లోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా..? రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా..? అని నిలదీశారు.

ఎల్‌నినో కాదు.. ప్రకృతి వైపరీత్యం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం..!

విద్యుత్ సమస్యలకు ప్రకృతి వైపరీత్యాలను సాకుగా చూపిస్తూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకూడదని కౌశిక్ రెడ్డి అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు. నేడు విద్యుత్ సరఫరాపై ప్రజల్లో ఆందోళన నెలకొనడానికి కారణాలేంటనేది ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సింగరేణి భవిష్యత్తును సంక్షోభంలోకి నెడుతున్నారా..?

తెలంగాణకు ఆర్థికంగా కీలకమైన సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. సింగరేణి సంస్థ బలోపేతం కావడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఆదాయం, కార్మికుల సంక్షేమం, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. సింగరేణి విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు సంస్థ భవిష్యత్తుకు, కార్మికుల ప్రయోజనాలకు అనుకూలంగా ఉండాలని అన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ అవసరాలు, సంస్థ నిర్వహణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, కార్మికుల హక్కులను కాపాడాలని కౌశిక్ రెడ్డి కోరారు.

విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి...

తెలంగాణ విద్యుత్ రంగం ప్రస్తుత పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర నివేదిక విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి ఎంత ఉంది..? రాష్ట్ర అవసరాలు ఎంత..? విద్యుత్ కొనుగోళ్లకు ఎంత ఖర్చు చేస్తున్నారు..? విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణాలేమిటి..? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ సరఫరా వ్యవస్థ, వ్యవసాయానికి అందించిన విద్యుత్‌పై వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాకుండా, ప్రస్తుత ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించాలని హితువు పలికారు.

విద్యుత్ అధికారులను బలిచేసి బాధ్యతల నుంచి తప్పించుకోలేరు...

విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు అధికారులపై నెపం నెట్టి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవడం సరికాదని కౌశిక్ రెడ్డి అన్నారు. విద్యుత్ సరఫరా సజావుగా జరిగేలా చూడటం, అవసరమైన వనరులను సమకూర్చడం, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న విద్యుత్ కోతలను తక్షణమే నివారించాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ హయాంలో విద్యుత్ రంగం.. అభివృద్ధి

కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను విద్యుత్ రంగంలో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేసిందని కౌశిక్ రెడ్డి అన్నారు. రైతులకు వ్యవసాయ విద్యుత్, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ అందుబాటులో ఉండేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగంలో తలెత్తుతున్న సమస్యలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎందుకు పెరుగుతున్నాయి..? రైతులకు నిరంతర విద్యుత్ ఎందుకు అందడం లేదు..? సింగరేణి సంస్థ భవిష్యత్తుపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి..? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూటి ప్రశ్నలు...

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలు ఎందుకు పెరుగుతున్నాయి..?

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోంది..?విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు అసలు కారణాలేమిటి..? సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదు..?

విద్యుత్ ఉత్పత్తి, కొనుగోళ్లు, పంపిణీ వ్యయాలపై సమగ్ర వివరాలు ఎందుకు వెల్లడించడం లేదు..?

రైతులు పంటలు సాగు చేయడానికి అవసరమైన విద్యుత్, నీరు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి..?

విద్యుత్ రంగంలో గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి ఏమిటి..?

విద్యుత్ సమస్యలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు..?

తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే...

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా, రాష్ట్రంలోని రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని, పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని, సింగరేణి సంస్థను బలోపేతం చేయాలని, విద్యుత్ రంగంపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ కాలం గడపడం మానుకోవాలని హితువు పలికారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుతూ, విద్యుత్ రంగాన్ని పటిష్టం చేసి, ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, డీసీబీ వైస్ చెర్మన్ పింగిళి రమేష్, తిరుపతి రావు, ఇంద్రసేన రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సంపత్ రావు, పొనగంటి సంపత్, మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి, వెంకటేష్, తిరుపతి రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మణ్ రావు, గందె శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ దిలీప్, వైస్ చైర్మన్ జావీద్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్లు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీ లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో రైతుల గోస, సింగరేణిలో అవినీతి ఆరోపణ

-సక్రమ విద్యుత్ ఇచ్చి సింగరేణిపై సమగ్ర విచారణ జరిపించాలని బీ.ఆర్.ఎస్ డిమాండ్



మేడిపల్లి అక్టోబర్ 16 (మనం న్యూస్): మేడిపల్లి మండల కేంద్రంలోని పి.ఎన్.ఆర్ గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు స్పందిస్తూ తెలంగాణ రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని, కరెంటు కోతలతో పంటలు నష్టపోతున్న రైతులకు తక్షణ సహాయం అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బొగ్గు నిల్వలు, సింగరేణి నిర్వహణ అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామ బీ.ఆర్.ఎస్ సర్పంచులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. “ఎద్దు ఏడిసిన ఎవుసం, రైతు ఏడిసిన రాజ్యం బాగుపడదని” అనే సామెతను మరవకూడదని అన్నారు. విద్యుత్ కోతల వల్ల పంటలు నష్టపోతున్న రైతులను గుర్తించి పరిహారం అందించాలని, కాలిపోయిన మోటార్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు నిల్వలు, సరఫరా పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు సింగరేణి వాటాల విక్రయం, ప్రైవేటీకరణపై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు. రైతులకు సక్రమంగా విద్యుత్ అందించేలా గడువుతో కూడిన కార్యాచరణ ప్రకటించాలని, రైతాంగానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గాగోజీ చారి, మకిలి దాస్, గంగారెడ్డి, సుప్రియ, హరీష్ రెడ్డి, కావేరి కుమారి తదితరులు పాల్గొన్నారు.

మండల సమస్యలపై తాసీల్దార్‌కు వినతిపత్రం



కాసిపేట, అక్టోబర్ 16(మనంన్యూస్)కాసిపేట మండలంలో అపరిష్కృత సమస్యలపై తాసీల్దార్ సునీల్ కుమార్ పాండే కు, శుక్రవారం ప్రజా సంఘాల అద్వర్యం లో నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దాదాపు పదేళ్లుగా కాసిపేట మండలానికి చెందిన గురుకుల పాఠశాల, బెల్లంపల్లి లో అద్దె భవనం లో నడిపిస్తున్నారని, మండలానికి తరలించాలని, కాసిపేట గ్రామ పంచాయతి కార్యాలయం ఎదురుగా, గట్రావుపల్లి గ్రామాల్లో రూ, లక్షల నిధులు ఖర్చు చేసి నిర్మించిన ఉప ఆరోగ్య కేంద్రాలు,ఏళ్ళు గడుస్తున్న నిరూపయోగం వున్నాయని, వాటిని లోకి ప్రజల ఉపయోగం లోకి తీసుకురావాలని,కొండాపూర్, కాసిపేట తూర్పుగూడెం ప్రధాన రహదారుల మిగులు పనులను పూర్తి చేసి ప్రజల, వాహనదారుల యిబ్బందులు తొలగించాలని, అందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని, లేకుంటే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వరకు పాదయాత్ర లాంటి నిరసన కార్యక్రమాలకు సిద్ధపడతామని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎఎమ్)జిల్లా కార్యదర్శి సంకె రవి, టిఆర్ఎస్ మండల ఇంచార్జ్ సోదారి సురేష్, సిపిఐ నాయకులు దుర్గం సుధాకర్, కాంగ్రెస్ నాయకులు భూక్య తిరుపతి నాయక్, బన్న రాములు, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట్ పంచాయతీ సిబ్బందికి పండుగ కానుకలు



చిగురుమామిడి, అక్టోబర్ 16 (మనం న్యూస్):పండుగ వేళ పారిశుద్ధ్య సిబ్బందికి ఆనందం పంచింది నవాబుపేట్ గ్రామపంచాయతీ పాలకవర్గం. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని శుక్రవారం సిబ్బందికి నూతన వస్త్రాలను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుళ్ళ రజితరాజు మాట్లాడుతూ “బతుకమ్మ అంటేనే రంగురంగుల పూల సంబరం. తంగేడు, గునుగు, బంతి పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలా మన గ్రామం కూడా రంగులతో, సంతోషంతో కళకళలాడాలి. అందుకు రేయింబవళ్లు కష్టపడే మన పారిశుద్ధ్య సిబ్బంది సేవలు ఎంతో అభినందనీయం. ఆడబిడ్డల పండుగ అయిన సద్దుల బతుకమ్మ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన దసరా పండుగల సంతోషాన్ని వారి కుటుంబాలతో పంచుకోవాలనే ఈ చిన్న కానుక అందజేశాం” అని అన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజలందరూ పండుగలను ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉపసర్పంచ్ ఇనుగాలు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు గోట్టే రఘుబాబు, కొడపర్తి శ్రీనివాస్, బోయిని వెంకటమ్మ, కార్యదర్శి సంపత్, బిల్ కలెక్టర్ ఎండి ఫారుక్, పాల్గొన్నారు.

యూనిక్ కంపెనీ పేరుతో పెట్టుబడుల మోసం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనాలు, అవసరమైతే ప్లాట్లు కేటాయిస్తామని నమ్మించి వార్షిక చెల్లింపులు, నెలవారీ కిస్తీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా ప్రజల నుంచి భారీగా డబ్బులు సేకరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గడువు ముగిసినప్పటికీ పెట్టుబడులు, మెచ్యూరిటీ మొత్తాలను తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 14 కేసులు నమోదైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. దేశవ్యాప్తంగా సుమారు 10 వేల మంది బాధితులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. మోసం ద్వారా సేకరించిన డబ్బులతో నిందితుడు పలు రాష్ట్రాల్లో హోటళ్లు, భూములు, ప్లాట్లు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.కరీంనగర్ జిల్లాలో యూనిక్ కంపెనీ పేరుతో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు వెంటనే కరీంనగర్ సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను లేదా అడిషనల్ డీసీపీ (అడ్మిన్)ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, విజ్ఞప్తి చేశారు. బాధితులు తమ వద్ద ఉన్న పెట్టుబడి రశీదులు, బ్యాంకు లావాదేవీల వివరాలు, కంపెనీకి సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను ఫిర్యాదుతో పాటు సమర్పించాలని సూచించారు.

కరెంట్ కోత ఎత్తి వేయాలని రైతుల ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

పర్యటిస్తే రైతుల పంటలు ఎలా ఎండుతున్నాయో అర్థం అవుతుందని తెలిపారు. రైతులకు 12 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎండుతున్న పంటలకు ఎకరానికి 25 వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కరెంట్ కోత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ రైతుల బాధలు పట్టక హైదరాబాద్ లో ఉండి ప్రజల్ని మోసం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో బెల్లంపల్లి లో ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఇప్పుడు మోసం చేస్తున్నారని అన్నారు. ఆయన్ను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఆశన్న, సీనియర్ నాయకులు బొల్లెడ్ల కేశవరెడ్డి, బి సి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య యాదవ్, గోవర్ధన్, జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్, బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షులు యుగంధర్, బిజెపి నాయకులు సురేష్, మల్లేష్, మహేందర్, డాగయా తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసులో నిందితుడి పట్టివేత

జైపూర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): జైపూర్ మండలంలో పోలీస్ కానిస్టేబుల్ అంజిబాబు ప్రాణాలు బలిగొని, ప్రమాదానంతరం పరారైన లారీ డ్రైవర్ మధు కంధన్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, సీఐ కె. నవీన్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 11న ఉదయం ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు డివైడర్ దాటుతున్న కానిస్టేబుల్‌ను ఢీకొట్టి నిందితుడు పరారయ్యాడు. పోలీసులు లారీని గుర్తించి నోటీసులు జారీ చేసినా నిందితుడు విచారణకు హాజరుకాకుండా అజ్ఞాతంలోకి వెళ్లాడు. పవర్ ప్లాంట్ సమీపంలో తన స్వస్థలమైన తమిళనాడుకు పారిపోయేందుకు యత్నిస్తుండగా ఎస్ఐ భూమేష్, పోలీస్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నామన్నారు. తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన నిందితుడి నుంచి లారీని, వాహన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసును వేగంగా ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



మంథని శ్రీమహాలక్ష్మి ఆలయంలో మహా అన్నప్రసాదాల వితరణ



మంథని, అక్టోబరు 16: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంథనిలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం భక్తులకు భారీ ఎత్తున అన్నప్రసాదల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంథనికి చెందిన ప్రముఖ న్యాయవాది లోకే కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ప్రతి ఏటా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లోకే రాధా కిషన్ రావు, సుధాకర్ రావు, శ్రీధర్ రావు, మనోహర్ రావు, కుటుంబ సభ్యులు ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం పెద్ద ఎత్తున అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తమ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఈ ఏడాది కూడా వివిధ రకాల రుచికరమైన వంటకాలతో అన్నప్రసాదాన్ని అందించి భక్తులను సంతృప్తిపరిచారు.అంతకుముందు ఆలయంలో వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, అన్నదాన కార్యక్రమం, భజనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది.

దుర్గాదేవిని దర్శించుకున్న పాత్రికేయులు



రాయికల్, అక్టోబర్ 16(మనం న్యూస్) : రాయికల్ మండలం మహితాపూర్ గ్రామ శివారులోని శ్రీగిరి పర్వతంపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారిని శుక్రవారం పలువురు పాత్రికేయులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు సింగిడి శంకరయ్య, వాసం లింబాద్రి,శ్యాంసుందర్, సురేష్,వెంకటేష్,కళ్యాణ్ ,గన్నవరం గంగాధర్,రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పాలపిట్టను బంధించడం వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద నేరం



మంథని అక్టోబర్16 (మనం న్యూస్) భూపాలపల్లి సర్కిల్ కాలేశ్వరం ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ బి.ప్రభాకర్, పెద్దపల్లి అటవీ శాఖ అధికారిజి.కృష్ణ గౌడ్ ఆదేశాల మేరకు మంథనిలోని శ్రీ మహాలక్ష్మి దేవాలయం ఆవరణలో గ్రీన్ జేవీఎస్ ఎన్జీవో వారియర్ చంద్రశేఖర్, హనుమంతరావు, మంథని కౌన్సిలర్ అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో పాలపిట్ట రక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. పాలపిట్టను బంధించడం వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ క్షేత్రాధికారి ఎస్ శ్రీనివాసరావు, మంథని డిప్యూటీ రైంజ్ ఆఫీసర్ పి. దేవదాస్,డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,అక్టోబర్ 16 (మనం ప్రతినిధి) 2026-27 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ప్రత్తి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పత్తి కొనుగోలు సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ లతో పాటు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 1 లక్ష 72 వేల 141 ఎకరాలలో ప్రత్తి సాగు చేయగా, మొత్తం 16 లక్షల 97 వేల 161 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఎకరానికి సగటున 9.60 క్వింటాళ్ల దిగుబడిని అంచనా వేయడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర ప్రకారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు, లాంగ్ స్టేపుల్ పత్తి ధర క్వింటాలుకు 8 వేల 667 రూపాయలు, మీడియం స్టేపుల్ పత్తి ధర క్వింటాలకు 8 వేల ,267 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని, రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పత్తిని విక్రయించి మద్దతు ధర పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో సి.సి.ఐ. ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కోసం 11 జిన్నింగ్ మిల్లులను ప్రతిపాదించగా, ఇందులో బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 5, చెన్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలో 5, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ పరిధిలో ఒక జిన్నింగ్ మిల్లును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీని తగ్గించి, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు సి.సి.ఐ. అందుబాటులోకి తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు తమ ఆధార్, ఫోన్ నంబర్, భూమి వివరాలు, పత్తి సాగు వివరాలతో యాప్‌లో నమోదు చేసుకోవాలని, అనుకూలమైన కొనుగోలు కేంద్రం / జిన్నింగ్ మిల్లును ఎంపిక చేసుకుని, తేదీ వారీగా స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం ప్రత్తిని విక్రయానికి తీసుకురావచ్చని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారులు రైతు వేదికలలో రైతులకు పత్తిలో తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలు, కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సగటు దిగుబడి కంటే ఎక్కువ దిగుబడి సాధించిన రైతుల భూములను ఏఈఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం సాఫ్ట్‌వేర్‌లో దిగుబడి పరిమితిని సవరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిజిటల్ సంతకం లేని రైతులు, కౌలు రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని, అర్హులైన రైతులందరికీ మద్దతు ధర ప్రయోజనం అందేలా పర్యవేక్షించాలని తెలిపారు. పత్తి కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు శాఖల వారీగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు.

-మార్కెటింగ్ శాఖ: ప్రతి మార్కెట్ యార్డులో తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.

-రెవెన్యూ శాఖ: గ్రామాలలో దండోరా ద్వారా మద్దతు ధరలు, కొనుగోలు కేంద్రాల వివరాలను రైతులకు తెలియజేయాలి. పత్తిని విడిగా, వదులుగా తీసుకురావాలని సూచించాలి.

- తూనికలు కొలతల శాఖ: జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డులలోని తూకం యంత్రాలు, వే-బ్రిడ్జిలను తనిఖీ చేసి, అవసరమైన కాలిబ్రేషన్ చేపట్టాలి.

- పోలీస్ శాఖ: రద్దీ ఎక్కువగా ఉండే మార్కెట్ ప్రాంతాలలో శాంతిభద్రతల పరిరక్షణకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలి.

-రవాణా శాఖ: ప్రత్తి రవాణా వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలి.

- అగ్నిమాపక శాఖ: జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డులలో అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు భద్రతా తనిఖీలు నిర్వహించాలి.

సి.సి.ఐ. కొనుగోలు కేంద్రాలుగా ప్రతిపాదించిన జిన్నింగ్ మిల్లుల యజమానులు కొనుగోలు ప్రక్రియకు అవసరమైన సాంకేతిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, విండోస్ 10 / అంతకంటే ఉన్నతమైన వెర్షన్ కలిగిన కంప్యూటర్, లేజర్ ప్రింటర్, వెబ్ కెమెరా, ఫింగర్‌ప్రింట్ స్కానర్, ఐరిస్ స్కానర్, ఎం.బి.పి.ఎస్. కంటే ఎక్కువ వేగం కలిగిన ఇంటర్నెట్ కనెక్షన్, సక్రమంగా తనిఖీ చేసిన వే-బ్రిడ్జి కనెక్టివిటీని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి, పత్తి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల గుర్తింపు,సంక్షేమమే లక్ష్యం



మంథని,అక్టోబర్16 (మనం న్యూస్) తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్ డా.పిడమర్తి రవి ఆదేశాల మేరకు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డా. కావటి సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో మంథని మండల కమిటీని ప్రకటించారు.శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనమాట్లాడుతూ ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు,గౌరవం, సంక్షేమ ఫలాలు అందించడమే కమిటీ లక్ష్యమని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం డా. పిడమర్తి రవి నేతృత్వంలో ఏళ్లుగా పోరాడుతున్నామని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కేకే కమిటీ వేసి ఆన్‌లైన్ దరఖాస్తుకు జీవో జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.ఆన్‌లైన్ దరఖాస్తులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉద్యమకారులంతా తమ ఫొటోలు,పేపర్ కటింగులు, ఆధారాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మంథని మండల కమిటీని ఆయన ప్రకటించారు అధ్యక్షులుగా మిర్యాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులు సాదుల శ్రీనివాస్, కోరవేన కుమార్, ఉపాధ్యక్షులు ముస్కె ఈశ్వరమ్మ,జిమ్మడ కొండయ్య,అరెల్లి సురేందర్,కార్యదర్శులు ఆకుల. అరుణ్,

కాసిపేట మల్లేష్, సంయుక్తకార్యదర్శులు అక్కపాక లక్ష్మి, ముత్తినేని నరేష్, ప్రచార కార్యదర్శులు కట్టెకోళ్ల విజయ్,దాడి శ్రీనివాస్,కోశాధికారి చిదురాల మధుకర్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ఎస్.కె. ముజీబ్,కార్యవర్గ సభ్యులు దాసరి శంకర్,తొర్తి శివ,కొండి సాగర్ లను నియమించారు.

ఆయన కళ్ళు సజీవం

-మరణంలో ఇద్దరు అందులకి చూపునిచ్చిన ఇరుముల్ల శ్రీనివాస్.



బెల్లంపల్లి, అక్టోబర్ 16, (మనం న్యూస్) : బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్ కి చెందిన ఇరుముల్ల శ్రీనివాస్ వయస్సు 40 సంవత్సరాలు అనారోగ్యంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా జనహిత సేవా సమితి ప్రచార కార్యదర్శి నేత్రదాన కమిటీ బాద్యులు డోలి సుకుమార్ కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించి వివరించగా పుట్టెడు దుఃఖంలో ఉండి నేత్రదానం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి నేత్రదానం చేయడానికి ముందుకు రావడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎల్.వి . ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్ నేత్రదానం లో భాగంగా కార్నియా స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ ఇరుముల్ల శ్రీనివాస్ మృతి బాధాకరమని పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులు వారి కుమారులు ఇరుముల్ల జోషువా, సురేష్, సోదరుడు ఇరుముల శేఖర్ కుటుంబ సభ్యులు నేత్ర దానం ద్వారా ఇద్దరి అందులకి చూపునివ్వాలని నేత్ర దానానికి ముందుకు రావడం



అభినందనీయం అని వీరి స్ఫూర్తితో ప్రజలందరూ మరణానంతరం నేత్ర అవయవ దానానికి ముందుకు రావాలని అన్నారు. జనహిత సేవా సమితి ద్వారా ఇది 25 వ నేత్రధాన కార్యక్రమం అని కే.శే. ఇరుముల్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యుల స్ఫూర్తితో ప్రజలందరు మరణించిన తరువాత నేత్ర, అవయవ,శరీరాలు కాల్చి బూడిద అయి వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటల లోపు మరణించిన వ్యక్తి యొక్క కంటి భాగం లోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని నేత్ర దానం ద్వారా ఇద్దరు అందులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించిన ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో అవయవాలు అవసరం ఉన్న ఆరుగురి ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని అలాగే శరీర దానం ద్వారా పార్థివ దేహాన్ని వైద్య కళాశాల కి అందించి కొన్ని వేల మంది వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడి ప్రజల వైద్య చికిత్స కి ఉపయోగపడే అవకాశం ఉందని ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ నేత్రధాన కార్యక్రమం కొరకు సహకారం అందించిన నేత్రదాత కుటుంబ సభ్యులు మరియు వార్డ్ కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి, మాజీ కౌన్సిలర్ చిట్యాల మధు ,ఆకుల వేణు జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కామ్పల్లి విజయకుమార్ ప్రచార కార్యదర్శి డోలి సుకుమార్, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.నేత్రదానం అనంతరం కుటుంబ సభ్యులకు ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు వారి సర్టిఫికెట్ అందజేయడం జరిగింది.

జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగం అమానుషం

సిరిసిల్ల అక్టోబర్ 16 (మనం ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణల నేపథ్యంలో, బాధితులను రాజన్న ప్రెస్ క్లబ్ సిరిసిల్ల అధ్యక్షుడు కొంపెల్లి మహేష్ కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు పోతురి శేఖర్, రాతిపల్లి సంపత్ లను పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధితులు ఈనెల 12వ తారీకున జర్నలిస్టులపై జరిగిన సంఘటన చాలా అన్యాయమని బాధితులు నేరళ్ల ఘటన తర్వాత మళ్లీ సిరిసిల్ల జిల్లాలో చోటు చేసుకోవడం, జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ఉపయోగించడం చాలా అన్యాయమని బాధితులు పేర్కొన్నారు. రాజన్న ప్రెస్ క్లబ్ సిరిసిల్ల అధ్యక్షుడు కొంపెల్లి మహేష్ మాట్లాడుతూ....ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా భావించే జర్నలిజం రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు.



జర్నలిస్టులపై దాడులు, వేధింపులు సహించరానివి

విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు, వేధింపులు జరిగితే ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలుగుతుందని అని అన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు జర్నలిస్టుల సంఘాలు ఐక్యంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

జర్నలిస్టులకు అండగా రాజన్న ప్రెస్ క్లబ్ సిరిసిల్ల.

బాధిత జర్నలిస్టులకు రాజన్న ప్రెస్ క్లబ్ సిరిసిల్ల అండగా ఉంటుందని అధ్యక్షుడు మహేష్ తెలిపారు. జర్నలిస్టులపై జరిగే అన్యాయాలను ప్రశ్నించడంలో, వారి హక్కుల పరిరక్షణలో రాజన్న ప్రెస్ క్లబ్ సిరిసిల్ల ముందుంటుందని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాసే జర్నలిస్టులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను రాజన్న ప్రెస్ క్లబ్ సిరిసిల్ల అధ్యక్షుడు కొంపెల్లి మహేష్ కోరారు.

రోవర్లు అందించే ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

-జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్

నస్పూర్, అక్టోబర్ 16, (మనం న్యూస్) : గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం రోవర్లు అందించేందుకు ఆసక్తి ఉన్నవారు సంబంధిత సరఫరా వివరాల సమాచారాన్ని జిల్లా అధికారిక వెబ్ సైట్ https://mancherial.telangana.gov.in qT సందర్శించాలని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర కౌన్సిల్‌లో మంథని మండల ఉపాధ్యాయులకు పదవులు సొంతం







మంథని,అక్టోబర్16 (మనం న్యూస్) : అక్టోబర్15,16 తేదీలలో నల్గొండ జిల్లాలో జరిగిన పి ఆర్ టీ యూ ఆరవ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మంథని మండలం నుండి ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర బాధ్యులుగా శుక్రవారం ఎన్నికయ్యారు.రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా దాసరి రఘు గౌడ్-ఎస్.జిటీ సూరయ్యపల్లి,దీటి శ్రీనివాస్-ఎస్.జీటీ లక్ష్మీపూర్ లు ఎన్నికయ్యారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కల్వల స్వామి-ఎస్ ఏ మ్యాత్స్,గుంజపడుగు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా పిఆర్.టీ యూ మంథని మండల అధ్యక్షులు గాధర్ల కొమురయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి సురేష్.మండల కార్యవర్గ సభ్యులు ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం,సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ఎన్నికైన నాయకులు పేర్కొన్నారు.వీరి ఎంపికకు కృషిచేసిన మండల అధ్యక్షులు గాధర్ల కొమురయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శి ఎగ్గడి సురేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆసుపత్రిలో రోగుల కోసం వాటర్ కూలర్ అందజేత

కన్నెపల్లి,అక్టోబర్ 16, (మనం న్యూస్) : ఆసుపత్రికి చికిత్స కోసం వస్తున్న రోగుల కోసం బిజెపి కన్నెపల్లి మండల అధ్యక్షుడు మైదం ఆశన్న ఉచితంగా అందజేశారు. కన్నెపల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, సిబ్బందికి మంచి నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించి ఆశన్న ఔదార్యం ప్రదర్శించారు. తన స్వంత డబ్బులతో 10000 రూపాయలు వెచ్చించి ఉచితంగా అందజేశారు. ఈ రోజు బిజెపి రాష్ట్ర నేత, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కొయ్యల ఏమాజి దానిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొయ్యల ఏమాజి మాట్లాడుతూ మోడీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా వాటర్ కూలర్ అందజేయడం అభినందనీయం అన్నారు. ఆశన్నను ఏమాజి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ అనిల్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు బొల్లెడ్ల కేశవరెడ్డి, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య యాదవ్, గోవర్ధన్, జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్, యుగంధర్, సురేష్, మల్లేష్, మహేందర్ పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్రస్థాయి పదవుల్లో రాయికల్ నాయకులు

రాయికల్, అక్టోబర్ 16(మనం న్యూస్) : పీఆర్‌టీయూ టీఎస్ ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర స్థాయి ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం నుంచి పలువురు నాయకులు పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్రస్థాయి పదవులకు ఎంపికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా పొన్నం రమేష్, గాజంగి రాజేశం, కన్నవేని మల్లారెడ్డి, బొమ్మకంటి రవికుమార్ ఎన్నిక కాగా, రాష్ట్ర కార్యదర్శులుగా లక్కడి రాజారెడ్డి, ఎం.డి. రాజ్ మహ్మద్, తాటిపల్లి వేణుగోపాల్, జాదవ్ వసంతరావు, అక్కినపల్లి సతీష్, దాసరి కృష్ణహరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు ఉపాధ్యాయ సంఘానికి కట్టుబడి పనిచేస్తూ, సంఘ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘ అభివృద్ధికి తోడ్పడతామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యల్ల అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి ఆనందరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, రాయికల్ అధ్యక్షులు అంతడుపుల గంగారాజం పాల్గొన్నారు.

సాయిరాం యూత్ దుర్గ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కుంకుమ పూజ



భీమారం అక్టోబర్ 16(మనం న్యూస్)మండల కేంద్రములోని, రావి చెట్టు వాడ సాయిరాం యూత్ దుర్గ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో, శుక్రవారం అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, మహిళలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, భక్తి శ్రద్ధలతో,అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు.

కరీంనగర్ డైరీ పాడి రైతులకు బోనస్ అందజేత

శంకరపట్నం అక్టోబర్ 16 (మనం న్యూస్) : కరీంనగర్ డైరీ కన్నాపూర్ గ్రామ పరిధిలోని పాడి రైతులకు శుక్రవారం దసరా పండుగ కానుకగా బోనస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్ డైరీ అధ్యక్షులు గోపు వీరారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది.ఈ కార్యక్రమంలో భాగంగా పాలు పోసిన అర్హులైన 64 మంది డైరీ సభ్యులు, పాడి రైతులందరికీ కలిపి మొత్తం రూ.33,290 బోనస్‌ను అందజేసినట్లు వీరారెడ్డి తెలిపారు.కార్యక్రమంలో డైరెక్టర్లు పిన్ రెడ్డి ,రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, నాయిని నాగరాజు, నూనె ఐలయ్య, పిన్నింటి తిరుపతి రెడ్డి, పిన్నింటి శ్రీనివాస రెడ్డి, రెడ్డి కొమురయ్య, చుక్కల గట్టయ్య, నూనె అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కౌమార బాలికలకు మునగ ఆకుల చపాతీ పిండి పోషకాహారం



రామగిరి, అక్టోబర్ 16 (మనం న్యూస్): తక్కువ బరువుతో ఉన్న కౌమార బాలికలకు మునగ ఆకుల చపాతీ పిండి పోషకాహారం చాలా ఉపయోగకరమైనదని రామగిరి రత్నాపూర్ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బైరినేని నవ్య రావు, సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు.హరితాపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమంనిర్వహించారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రామగిరిఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో తక్కువ బరువుతో ఉన్న కౌమార బాలికలకు మునగ ఆకుల చపాతీ పిండి పోషకాహార అనుబంధంగా వినియోగం అనే అంశంపై ప్రథమ శ్రేణి ప్రదక్షిణ క్షేత్రం నిర్వహించారు.ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ నవ్యరావు మాట్లాడుతూ, మునగ ఆకుల్లో విటమిన్లు, ఖనిజ లవణాలు, కాల్షియం, ఇనుము, ప్రోటీన్లు తదితర పోషకాలు సమృద్ధిగా ఉంటాయని వివరించారు. మునగ ఆకుల పొడిని చపాతీ పిండిలో తగిన మోతాదులో కలిపి వినియోగించడం ద్వారా రోజువారీ ఆహారంలో పోషక విలువలను పెంచుకోవచ్చని తెలిపారు. కౌమార దశలో బాలికల శారీరక ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణకు సమతుల్య ఆహారం ఎంతో ముఖ్యమని, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పాలు, ఇతర పోషకాహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. తక్కువ బరువుతో ఉన్న బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవాలని వివరించారు.హరితాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు కార్యక్రమంలో పాల్గొని బాలికలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఎదగాలని సూచించారు. గ్రామీణ మహిళలు, బాలికలు కృషి విజ్ఞాన కేంద్రం అందించే శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రోత్సహించారు.గ్రామీణ ప్రాంతాల్లో బాలికల పోషకాహార స్థితిని మెరుగుపరచడం, స్థానికంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహార వనరుల వినియోగంపై అవగాహన కల్పించడం ఈ ప్రదర్శనా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని డాక్టర్ నవ్య తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బాలికలు, మహిళలకు ఉచితంగా ఈ పౌష్టికాహార పిండిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోహరితాపూర్ సర్పంచ్ బాద్రాపు.ప్రవళిక ప్రశాంత్, సెక్రటరీ గంగుల.సంతోష్, వార్డు సభ్యులు పబ్బా.ప్రవంతి వెంకటేష్, కెక్కర్ల ఉష అశోక్,బత్తిని.ప్రశాంత్, బత్తుల రాజమని రమేష్,కలవేన రవి, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా క్రీడాకారులను సన్మానించిన మంత్రి పొన్నం



కరీంనగర్ స్పోర్ట్స్ (మనం న్యూస్) ఇటీవల రాజస్థాన్ జైపూర్ లో జరిగిన 51 వ జాతీయస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్షిప్ పోటీలలో పథకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. శుక్రవారం ఉదయం మినిస్టర్స్ క్వార్టర్స్ లో క్రీడాకారులను సన్మానించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. దానికి తగు శిక్షణలో పూర్తిస్థాయిలో సాధన చేసి అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేయాలని కోరారు. జాతీయస్థాయిలో మేడ్చల్ జిల్లాకు చెందిన కట్టెకోల భవజ్ఞ (12 -14) బాలికల విభాగంలో కాంస్య పథకం సాధించి, గత రెండు దశాబ్దాల చరిత్రను తిరగేసిందని, అదే మాదిరిగా రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎన్ ,వాసవి (08 - 10) బాలికల విభాగంలో ఐదవ స్థానం సాధించింది, కరీంనగర్ కు చెందిన మరో క్రీడాకారుడు పి దీపక్ (14 -16) బాలుర విభాగంలో 5వ స్థానాన్ని కైవసం చేసుకోగా గత సంవత్సరం ఇతడు బంగారు పతకం సాధించినట్టు తెలంగాణ యోగా సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. సిద్ధారెడ్డి తెలిపారు. గత 22 సంవత్సరాలలో మొదటిసారి జాతీయస్థాయిలో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారని సిద్ధారెడ్డి తెలిపారు.విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జాల మనోహర్ కుమార్, రాష్ట్ర యోగ సంఘం అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, కరీంనగర్ నిజాంబాద్ జగిత్యాల పెద్దపల్లి జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శులు గుంటి రామకృష్ణ, సిహెచ్. గంగాధర్, టీ. మనోజ్ కుమార్, పి. సాగర్ కోచులు సిహెచ్. జయశంకర్, పోలం సునీత, ఏ. ఆనంద కిషోర్ పాల్గొన్నారు.

జిఎం కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు



రామగిరి, అక్టోబర్ 16 (మనం న్యూస్): బతుకమ్మ సంబురాలను పురస్కరించుకొని శుక్రవారం నాడు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జి.ఎం.కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ ఆట-పాట కార్యక్రమంలో వివిధ విభాగాల మహిళా అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పూలను దేవతలుగా పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలందరూ ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండుగ అన్నారు.తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగ గొప్పతనాన్ని రాబోయే తరాలకు కూడా తెలియజేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆర్జీ-3 ఏరియా ఇంచార్జ్ సేవా అధ్యక్షురాలుఈంకటలక్ష్మీ నాగేశ్వరరావు బతుకమ్మ ఆట-పాటలో పాల్గొని మహిళా ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటుజిఎం బండి సత్య నారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఐ ఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఫైనాన్స్ డిజియం సి.జె.సురేఖ, ఏరియా సెక్యూరిటీ అధికారి కోల శ్రీనివాస్, తో పాటు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు గణనీయం



రామగిరి, అక్టోబర్ 16 (మనం న్యూస్): దసరా పండుగను పురస్కరించుకుని రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు పారిశుద్ధ్య సామగ్రిని శుక్రవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పంపిణీ చేశారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా గ్రామ వీధులు, పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పండుగల సమయంలో గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈదసరా పండుగ సందర్భంగా కార్మికులకు అవసరమైన పారిశుద్ధ్య సామగ్రిని అందించడం ద్వారా వారి విధుల నిర్వహణకు సహకారం అందించడమే లక్ష్యమని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే వేయాలని కోరారు.ఈగ్రామ అభివృద్ధితో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామపంచాయతీ తరపున నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు తెలిపారు. 15మంది సిబ్బందికి బట్టల సబ్బులు, పెయ్యి సబ్బులు, కొబ్బరి నూనె, సర్ఫ్, టూత్ పేస్ట్ ఇవ్వడం జరిగింది. ఒక్కొక్క జత డ్రెస్ లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాద్రాపు.ప్రవళిక ప్రశాంత్, సెక్రటరీ గంగుల.సంతోష్, వార్డ్ సభ్యులు పబ్బా.స్రవంతి వెంకటేష్, కెక్కర్ల ఉష అశోక్,బత్తిని.ప్రశాంత్, బత్తుల రాజమని రమేష్,ఈకలవేన రవి, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్, గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి



కోరుట్ల అక్టోబర్ 16 (మనం న్యూస్) : వ్యవసాయ పంటలు చేతికి వచ్చే ప్రస్తుత కీలక సమయంలో విద్యుత్ కోతలు, తీవ్రమైన లో- వోల్టేజీ సమస్యల వల్ల పంటలు కళ్ళముందే ఎండిపోతుండడం అత్యంత విచారకరమనీ, చివరి దశలో ఉన్న వ్యవసాయ పంటలను ఆదుకునేందుకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి వ్యవసాయ రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోరుట్లలో శుక్రవారం నాడు తెలంగాణ రైతు ఐక్యవేదిక నాయకులు మామిడి నారాయణరెడ్డి, గురిజెల రాజారెడ్డిలతో కలిసి శేర్ నర్సారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలు, తీవ్రమైన లో-వోల్టేజీ సమస్యల వల్ల వ్యవసాయ పంటలు కళ్ళముందే ఎండిపోతుండడం అత్యంత విచారకరమని అన్నారు. పంటలు పక్వానికి వచ్చే చివరి తరుణంలో నీరు అందక ఎండిపోతున్నాయనీ, దీనివల్ల రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందనీ ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్రమైన లో-వోల్టేజీ కారణంగా పొలాల్లోని కరెంటు మోటర్లు కాలిపోతున్నాయనీ, ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు మోటర్ల మరమ్మత్తు ఖర్చులు అదనపు భారంగా మారాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఏ సమయంలో కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. వ్యవసాయ పంటలు చివరి దశలో ఉన్నందున పంటలు చేతికి వచ్చే వరకు ఎలాంటి అప్రకటిత విద్యుత్ కోతలు విధించవద్దనీ, మోటర్లు కాలిపోకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయాలని శేర్ నర్సారెడ్డి కోరారు. లో- వోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలలో వెంటనే అదనపు ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సోదర భావంతోనే బతుకమ్మ, దసరా పండుగ జరుపుకోవాలి



కాల్వ శ్రీరాంపూర్, మనం న్యూస్ అక్టోబర్ 16 : కాల్వ శ్రీరాంపూర్ బతుకమ్మ, దసరా పండుగలను గ్రామ ప్రజలందరూ సోదర భావంతో, ఐక్యతతో జరుపుకోవాలని శ్రీరాంపూర్ సర్పంచ్ బంగారి రమేష్ పిలుపునిచ్చారు. గ్రామంలో బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ మహిళలకు ఎంతో ప్రత్యేకమైనదన్నారు. గ్రామంలోని ఆడబిడ్డలందరూ కలిసి బతుకమ్మ ఘాట్ వద్ద బతుకమ్మలను పేర్చి ఆనందంగా సంబరాలు జరుపుకోవాలన్నారు. అదేవిధంగా దసరా పండుగను కూడా కులమతాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ తరపున పండుగ ఏర్పాట్లకు పూర్తి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.

కాల్వ శ్రీరాంపూర్ హరిహర ఆలయంలో ఘనంగా దుర్గామాత పూజలు



కాల్వ శ్రీరాంపూర్ మనం న్యూస్ అక్టోబర్16 : కాల్వ శ్రీరాంపూర్, మండల కేంద్రంలోని ప్రసిద్ధ హరిహర దేవాలయంలో శుక్రవారం దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ దంపతులు పద్మజ, కోటేశ్వర్ అమ్మవారికి చీరె, ముడుపు బియ్యం సమర్పించారు. అమ్మవారికి పంచామృత అభిషేకం చేసి, పూలు, పండ్లతో అర్చన చేశారు. ఆలయ అర్చకులు దత్తాత్రేయ శర్మ వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్-జ్యోతి, మేనేజర్ ఎర్రబాటి రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు రఘుపతిరావు, కిషన్ రెడ్డి, శివరామకృష్ణ, అల్లం రాజయాదవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ మల్లేష్ కుటుంబానికి మిత్ర బృందం ఆర్థిక సహాయం

భీమారం అక్టోబర్ 16(మనం న్యూస్)మండల కేంద్రములో, బీసీ కాలనికి చెందిన వేల్పుల. మల్లేష్ గత నెల రోజుల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందగా,తన కుటుంబానికి తోటి టాటా మ్యాజిక్ ఓనర్స్ అసోసియేషన్ మిత్ర బృందం తరపున రూ.20,000రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని భీమారం ఎస్సై ఎ. రాజేందర్ చేతుల మీదుగా మల్లేష్ కుటుంబ సభ్యులకు అందించారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని ఈ సందర్భంగాఎస్ ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, టాటా మ్యాజిక్ అసోసియేషన్ చెన్నూర్ అధ్యక్షుడు ఎన్. సమ్మయ్య, ఉపాధ్యక్షుడు జాడి శ్రీనివాస్, బి. వెంకటేష్, జి. తిరుపతి, దుర్గయ్య, రవి తదితర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



దుర్గమ్మ ముందు ఇరుముడి చిత్రంతో భక్తులకు కనువిందు

చిగురు మామిడి,అక్టోబర్ 16 (మనం న్యూస్):సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ముందు దుర్గాదేవి మండపం వద్ద భక్తులకు వినోదంతో పాటు భక్తిని పంచేలా ఇరుముడి చిత్రాన్ని ప్రదర్శించారు.దేవీ నవరాత్రులను పురస్కరించుకుని నిర్వాహకులు దుర్గమ్మ మండపం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై ఇరుముడి సినిమాను ప్రదర్శించగా, భక్తులు పెద్ద ఎత్తున తిలకించి ఆనందించారు. అమ్మవారి మహత్యాన్ని తెలిపే ఇరుముడి సినిమా ప్రదర్శనతో భక్తి పారవశ్యం నెలకొంది.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గామాత అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలి



జమ్మికుంట, అక్టోబర్ 16 (మనం న్యూస్): దుర్గామాత అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవీ నవరాత్రుల సందర్భంగా ఆ దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు జమ్మికుంట మార్కెట్ కమిటి చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని 24వ వార్డు గణేష్ నగర్ లోని దుర్గామాత అమ్మవారిని శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ... దుర్గామాత ఉత్సవాలు భక్తి, ఐక్యత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం మహా అన్నదానప్రసాదం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్. మల్లేశం, గ్రేడ్ -×× కార్యదర్శి ఎన్.రాజా, మార్కెట్ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గంగారంలో ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

కాల్వ శ్రీరాంపూర్ మనం న్యూస్ అక్టోబర్ 16 : కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఈద మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారుఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడి అశోక్ గౌడ్ ఆలయ ఉపాధ్యక్షులు మేడి దేవేందర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గుడ్ల నరేష్ ప్రచార కార్యదర్శి మేడి తిరుపతి గౌడ్ ముఖ్య సలహాదారులు పాలకుర్తి పరుశరాములు గౌడ్ కోశాధికారి తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్ కార్యవర్గ సభ్యులు వేముల యాదగిరి, మేడి రాజయ్య గౌడ్, నేదురు రమేష్ పాల్గొన్నారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.



జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై విచారణ జరపాలి



కరీంనగర్ అక్టోబర్ 16(మనం బ్యూరో)..పత్రికలో వార్తా కథనాలు ప్రచురించిన జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్‌రావు డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ శేఖర్‌లను శుక్రవారం పరామర్శించి, ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ.. గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై వరుస కథనాలు ప్రచురించినందుకు జర్నలిస్టులపై ప్రతీకార చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం, పోలీసుల అదుపులో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ ఘటనపై సిరిసిల్ల జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు.

స్వతంత్ర విచారణకు డిమాండ్...

పోలీసుల అదుపులో ఉన్న సమయంలో మొబైల్ ఫోన్లు తీసుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఆలస్యంగా అందిందని బాధితులు పేర్కొన్నారన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎక్కడెక్కడ దాడులు జరిగాయి? ఎవరు బాధ్యులు? ఎవరి ఆదేశాలతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి? అనే అంశాలపై స్వతంత్రంగా విచారణ జరపాలని బాపురావు, గాదె కరుణాకర్‌రావు డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలో ఇలాంటి ఆరోపణలకు తావుండకూడదని, గంభీరావుపేట ఎస్ఐతో పాటు బాధ్యులైన పోలీసులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల జర్నలిస్టులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు నరేష్, శంకర్, సురేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి వ్యాపార సంస్థలు దోహదపడాలి



జమ్మికుంట, అక్టోబర్ 16 (మనం న్యూస్): ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి వ్యాపార సంస్థలు దోహదపడాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం అన్నారు. జమ్మికుంట మండలం వావిలాల గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వప్న సదానందం స్థానిక సర్పంచ్ కొండ అర్జున్ గౌడ్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ స్వప్న సదానందం, సర్పంచ్ అర్జున్ గౌడ్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటవడం అభినందనీయమన్నారు. పెట్రోల్ బంక్ ద్వారా వాహనదారులకు ఇంధన సేవలు అందుబాటులోకి రావడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. వ్యాపార రంగంలో ముందుకు వస్తున్న నిర్వాహకులు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రజల ఆదరణ పొందాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా సేవలు అందిస్తూ వ్యాపార అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వాహకులు గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

దండేపల్లి నూతన ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవం



దండేపల్లి, అక్టోబర్ 16(మనం న్యూస్) : దండేపల్లి మండల నూతన ప్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ హాల్‌ను శుక్రవారం లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా పురోహితులు సంతోష్ అయ్యగారి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ మాధంశెట్టి మల్లికార్జున్, సభ్యులు కొండూ జనార్దన్, బోలిశెట్టి రాజన్న, కొండూ రామన్నలు రిబ్బన్ కట్ చేసి ప్రెస్ క్లబ్ హాల్‌ను ప్రారంభించారు. నూతన ప్రెస్ క్లబ్ హాల్ ప్రారంభంతో మండల పాత్రికేయులకు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుకూలమైన వేదిక అందుబాటులోకి వచ్చిందని ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు కుంచె ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుంచే ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శేర్ల చక్రపాణి, తోట్ల మల్లేష్, బచ్చల సుభాష్, కుర్సెంగ అరుణ్ కుమార్, బొడ్డు జగన్, ముత్తే రమేష్, బుర్ర తిరుపతి, అత్తే సుధాకర్, కే. మల్లేష్, కొల్లూరు సతీష్ కుమార్, ఏనుముల తిరుపతి, వేణుగోపాల్, సంతపురి కిషోర్ తదితర ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దళిత సర్పంచ్ పై దాడి కేసులో ఏసీపీ విచారణ



సైదాపూర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గర్రెపల్లి నూతన గ్రామ పంచాయతీ దళిత సర్పంచ్ మాచర్ల శ్రీకాంత్ పై జరిగిన దాడి కేసులో హుజూరాబాద్ ఇన్‌ఛార్జి ఏసీపీ విజయ్ కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. గర్రెపల్లెలోని పోచమ్మ ఆలయ భూమి, పండుగ విషయమై విచారణకు వచ్చిన మండల ఆర్ఐ వినోద్ కుమార్ తో కలిసి సర్పంచ్ శ్రీకాంత్ ఆలయం వద్ద ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన వరికెల లక్ష్మి, ఆమె భర్త కుమార్ కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామాన్ని సందర్శించిన ఏసీపీ విజయ్ కుమార్ ఘటనపై ఆరా తీశారు. నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ సీఐ వి. శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, దళిత సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేములవాడలో బతుకమ్మ సంబరాలు



వేములవాడ,అక్టోబర్ 16 (మనం న్యూస్):రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో ఆడపడుచులు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేములవాడ పురవీధుల గుండా బతుకమ్మలతో మహిళలు ఊరేగింపుగా బతుకమ్మ ఘాట్ వద్దకు చేరుకోవడంతో పట్టణ వీధులన్నీ బతుకమ్మ ఆటపాటలతో మారుమోగుతున్నాయి. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సంబరాలను పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాల నడుమ జరుపుకుంటున్నారు. బతుకమ్మ ఘాట్ వద్ద మహిళలంతా ఒకచోట చేరి వలయంగా తిరిగి పాటలు పాడుతూ ఆటలు ఆడుతున్నారు. అనంతరం మూలవాగు నీటిలో బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసి, వాయనాలు ఇచ్చు పుచ్చుకోవడంతో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.

బంగారం మైసమ్మ ఆలయంలో చండీ హోమం



బెల్లంపల్లి, అక్టోబర్ 16, (మనం న్యూస్) : మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ లోని బంగారు ఆలయంలో శుక్రవారం శ్రీ దుర్గా మాత నవరాత్రుల సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ఈ హోమ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి సంధ్యారాణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం



చిగురుమామిడి: అక్టోబర్ 16 (మన న్యూస్) : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల పరిధిలోని సుందరగిరి,కొండాపూర్ గ్రామాల్లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో విద్యుత్ శాఖ ఎస్ఈ విజెందర్ రెడ్డి,డీఈ తిరుపతి,ఇందుర్తి ఏఈ అన్వేష్ లు కలిసి స్థానిక పంట పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పొలాల వద్ద ఉన్న రైతులతో నేరుగా మాట్లాడారు. వ్యవసాయానికి అందుతున్న విద్యుత్ సరఫరాపై ఆరా తీస్తూ, రైతులకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పొలాల వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్లను సైతం పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేవని,సరఫరా సజావుగా సాగుతోందని స్పష్టం చేశారు. రైతులకు విద్యుత్ పరంగా ఎలాంటి అంతరాయాలు లేదా సమస్యలు ఎదురైనా,వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల లేదా లైన్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని,సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది,స్థానిక రైతులు పాల్గొన్నారు.

నిజాలు రాస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సిగ్గుచేటు



కరీంనగర్, అక్టోబర్ 16(మనం బ్యూరో)....కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏక్ దమ్ న్యూస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో సంపత్, ఎడిటర్ కొత్తూరు శేఖర్‌లను బిజెపి ఎస్సీ సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ పలువురితో కలిసి పరామర్శించారు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి న్యాయం జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బత్తుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్ఐ చుక్కల శ్రీకాంత్‌తో పాటు నలుగురు కానిస్టేబుళ్లు జర్నలిస్టులను కరీంనగర్ నుండి కిడ్నాప్ చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించి, తీవ్రంగా కొట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, జరిగిన పరిణామాలపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడి జరిగిందనే ఆరోపణలను తీవ్రంగా పరిగణించి, బాధితుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఉన్నంత అధికారులను కోరారు. నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను నిర్బంధించడం, దాడి చేయడం, జరిపించాలి. వైద్య పరీక్షలు, ఆధారంగా వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు చేయాలి ఎస్ఐ తో పాటు నలుగురు కానిస్టేబుల్ లను తక్షణమే విధులు నుండి సస్పెండ్ చేయాలి బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు ఎడ్ల సురేష్ లింగంపల్లి కళ్యాణ్ చందు రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా గరుడ వస్త్ర సిల్క్స్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం



జమ్మికుంట, అక్టోబర్ 16 (మనం న్యూస్): తెలంగాణలో వస్త్ర వ్యాపార రంగంలో తనదైన గుర్తింపును చాటుకుంటున్న గరుడ వస్త్ర సిల్క్స్ సంస్థ జమ్మికుంట పట్టణంలోని సురక్ష హాస్పిటల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ వస్త్ర సిల్క్స్ -- ఫ్యామిలీ షాపింగ్ మాల్ షోరూమ్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రముఖ సినీ నటి నభా నటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన వస్త్రాలు, సంప్రదాయ చేనేత కళల వైభవం, ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్స్‌ను ఒకే వేదికపై అందించాలనే లక్ష్యంతో గరుడ వస్త్ర సిల్క్స్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. నాణ్యమైన వస్త్రాలను వినియోగదారులకు అందిస్తూ వారి ఆదరాభిమానాలు పొందేందుకు కృషి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా గరుడ వస్త్ర సిల్క్స్ సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ... “బనారసీ, కాంచీపురం, ధర్మవరం, గద్వాల్ వంటి ప్రసిద్ధ సంప్రదాయ చేనేత వస్త్రాల అద్భుతమైన వైభవాన్ని, భారతీయ చేనేత వారసత్వపు గొప్పదనాన్ని మా కలెక్షన్ల ద్వారా వినియోగదారులకు అందిస్తున్నామని అన్నారు. సంప్రదాయ అందానికి ఆధునిక శైలిని జోడిస్తూ, నాణ్యత, ప్రామాణికత, సాగసుకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి సందర్భానికి తగిన ప్రత్యేక వస్త్రాలను అందించడమే తమ లక్ష్యం” అని తెలిపారు. తమ షోరూమ్‌లో మహిళల కోసం ప్రత్యేకమైన చీరల కలెక్షన్లు, సంప్రదాయ వస్త్రాలు, ఆధునిక దుస్తులు, పురుషులు మరియు పిల్లలకు అనువైన ఫ్యాషన్ దుస్తులు సహా కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ తగిన విభిన్న రకాల వస్త్రాలను అందుబాటులో ఉంచమన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి -– కేకే మహేందర్ రెడ్డి భేటీ

రాజకీయంగా ఆసక్తికర చర్చ!.

సిరిసిల్ల రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు సంకేతమా?.

నామినేటెడ్ పదవుల భర్తీపై ఆశలు.. కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ.



సిరిసిల్ల, అక్టోబర్ 16 (మనం ప్రతినిధి):తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిరిసిల్ల కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్ రెడ్డి మధ్య జరిగిన భేటీ రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ భేటీ ప్రాధాన్యత ఏమిటి? సిరిసిల్ల రాజకీయాలపై దీని ప్రభావం ఎలా ఉండబోతోంది? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న భేటీ!.

సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కేకే మహేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తిని పెంచుతోంది. పార్టీ బలోపేతం, నాయకులకు ప్రాధాన్యత, భవిష్యత్తు రాజకీయ పరిణామాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ భేటీపై చర్చ జరుగుతోంది.

నామినేటెడ్ పదవులపై ఆశలు.!

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆశలు పెట్టుకున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు, బాధ్యతలు దక్కాలని పలువురు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేకే మహేందర్ రెడ్డికి భవిష్యత్తులో ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారన్న అంశం ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వం నుండి అధికారికంగా ప్రకటన కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు.

సిరిసిల్ల రాజకీయాల్లో ఎలాంటి మార్పులు?.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ రాజకీయాల భవిష్యత్తు, పార్టీ నాయకుల మధ్య సమన్వయం, స్థానికంగా పార్టీని మరింత బలోపేతం చేసే చర్యలు కీలకంగా మారాయి. ముఖ్యమంత్రితో జరిగిన భేటీ ఈ అంశాలపై చర్చకు దారితీసినా, దాని ఆధారంగా తక్షణ రాజకీయ మార్పులు వస్తాయని బహిరంగంగా చర్చ జరుగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి--కేకే మహేందర్ రెడ్డి భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలు వెలువడిన తర్వాతే దీని రాజకీయ ప్రాధాన్యతపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టీఆర్పీ పట్టణ అధ్యక్షునిగా వెంకటేష్



బెల్లంపల్లి, అక్టోబర్ 16, (మనం న్యూస్) : తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంసస్థాగత నిర్మాణంలో భాగంగా బెల్లంపల్లి పట్టణ అధ్యక్షునిగా సత్రవేణి వెంకటేష్ ను జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ నియమించారు. బెల్లంపల్లి పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పనిచేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మహేష్ వర్మ సూచించారు. అనంతరం సత్రవేణి వెంకటేష్ మాట్లాడుతూ నాకు అప్పజెప్పిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా, ఎవరెంతో వారికంతా వాటా అందించడంలో బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ అధ్యక్షతన బెల్లంపల్లి పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తామని స్పష్టం చేసారు.

80 ఫీట్ల రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 16 (మనం ప్రతినిధి): వేములవాడ మూలవాగు బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆర్ అండ్ బీ, ఆలయ, మున్సిపల్, ఎన్పీడీసీఎల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వేములవాడలో ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. విద్యుత్ టవర్ల నిర్మాణం పూర్తి చేసి రోడ్డు పనులను వేగవంతం చేయాలని, బద్ది పోచమ్మ ఆలయ పనుల కోసం కార్మికుల సంఖ్య పెంచాలని సూచించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

మున్సిపాలిటీలోనూ ఉపాధి హామీ అమలు చేయాలి

చెన్నూరు అక్టోబర్ 16 (మనం న్యూస్): మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బోగే సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని పద్మనగర్‌లో సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సామల ఉమారాణి అధ్యక్షతన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల పేదలకు పనులు దొరక్క కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అప్పులు తీర్చలేక పలువురు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. మున్సిపాలిటీల్లోనూ ఉపాధి పనులు కల్పించి పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంతకాల సేకరణలో కార్మికులు, ఉపాధి కూలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భూపెల్లి మణి, బోగే నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో ఘనంగా బతుకమ్మ ఫ్యామిలీ డే వేడుకలు



యైటింక్లయిన్ కాలనీ,మనం న్యూస్ అక్టోబర్ 16 : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రామగుండం-2 ఏరియా ఆధ్వర్యంలో ఫ్యామిలీ డే మరియు బతుకమ్మ వేడుకలు శుక్రవారం సాయంత్రం సిఇఆర్ క్లబ్, 8 ఇంక్లైన్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఏరియా జనరల్ మేనేజర్ టి. లక్ష్మీపతి గౌడ్ ముఖ్య అతిథిగా, సేవా అధ్యక్షురాలు శ్రీమతి కరుణా లక్ష్మీపతి గౌడ్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు సంప్రదాయ బద్ధంగా బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ ఆటపాటలతో, ఆటపాటలతో పాటు పలు పాటల పోటీలతో సందడి చేశారు. మహిళలు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బతుకమ్మ మరియు వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా జిఎం లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను కుటుంబ సభ్యులందరూ కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందని, ఇలాంటి వేడుకల వల్ల కాలనీలో మహిళలు, కుటుంబ సభ్యుల మధ్య స్నేహభావం, ఐక్యత పెంపొందుతుందని అన్నారు. పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం రాముడు, ఏరియా అధికార ప్రతినిధి ఎన్ వేణుగోపాల్, మెడికల్ సూపరింటెండ్ మహిపాల్, ఏరియా వర్క్ షాప్ రామ్ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహ్మద్ , సివిల్ పి. బాలరాజు, ట్రేడ్ యూనియన్ నాయకులు రాజరత్నం, అన్నారావు ఏరియా అధికారులు, సిబ్బంది, సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 16 (మనం ప్రతినిధి): ఎల్నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు వరికి బదులుగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల సూచనలతో పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తెలంగాణ జలసిరి పథకం కింద బోర్‌వెల్ రీఛార్జి గుంతలు, ఫామ్ పాండ్లు, మ్యాజిక్ సోక్ పిట్ పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని, ఉపాధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. పశువులకు నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సరఫరా, వైద్య సేవలకు సంబంధించి కూడా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వేములవాడ బతుకమ్మ వేడుకల్లో నటులు సాయికుమార్,రామ్‌జగన్ సందడి



వేములవాడ,అక్టోబర్ 16 (మనం న్యూస్):వేములవాడలో ఘనంగా జరుగుతున్న సద్దుల బతుకమ్మ వేడుకల్లో సినీ నటులు సాయికుమార్, రామ్ జగన్ పాల్గొన్నారు. ఈ సంబురాల్లో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజులతో కలిసి వారు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పండుగ వాతావరణంలో స్థానిక ప్రజలు, ఆడపడుచులతో కలిసి వారు వేడుకల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ నిలువెత్తు రూపమని కొనియాడారు. రాజన్న క్షేత్రంలో సద్దుల బతుకమ్మ సంబురాలు ఇంత వైభవంగా జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నాయకులు, సినీ నటులు పాల్గొనడంతో మూలవాగు పరిసర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకల శోభ మరింత సంతరించుకుంది.

ఎస్‌టిపిపిలో 'బతుకమ్మ – ఫ్యామిలీ డే' వేడుకలు



జైపూర్, అక్టోబర్ 16 (మనం న్యూస్):జైపూర్ మండల కేంద్రం ఎస్‌టిపిపి ప్రాంగణంలో బతుకమ్మ పండగ పురస్కరించుకొని 'బతుకమ్మ – ఆటపాట, ఫ్యామిలీ–డే' వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఈడీ సిహెచ్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో పవర్ ప్లాంట్ మహిళా ఉద్యోగులు, టౌన్‌షిప్ మహిళలు, చిన్నారులు రంగురంగుల పూలతో బతుకమ్మలను శోభాయమానంగా అలంకరించి ఉత్సాహంగా ఆటపాటలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు.ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు నిర్వహించిన క్విజ్ పోటీలు విశేషంగా ఆకట్టుకోగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో జీఎం కె. సూర్యనారాయణ రాజు, జీఎం ఇ. భీభత్స, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎమ్ఓఏఐ బ్రాంచ్ అధ్యక్షుడు డి. పంతులా, ఏజీఎం వి.వి. సుధాకర్ రెడ్డి, చీఫ్ (ఓఎమ్) కె. శివప్రసాద్, పర్సనల్ విభాగాధిపతి ఎస్.వి. రాజేశ్వర్ రావు తదితర అధికారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో దుర్గాదేవి ప్రత్యేక పూజలు

-జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన బైండ్ల శ్రీకాంత్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 16 (మనం న్యూస్):ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శరన్నవరాత్రుల వేడుకలను పురస్కరించుకుని కందకం గడ్డ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బైండ్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన బైండ్ల శ్రీకాంత్‌ను మున్నూరు కాపు సంఘం మరియు దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో.. కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొడిమ్యాల దీపక్ రాజ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాసరి మోహన్, పిట్టల వెంకటేష్, రెబ్బాస్ మల్లేష్ దుర్గాదేవి కమిటీ సభ్యులు పడాల రాజేందర్, మంగ మధు, జంగిల్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గా మాత ప్రత్యేక పూజలు

. హాజరైన టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంతి మోహన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 16 (మనం న్యూస్): ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మున్నూరు కాపు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాతా మండపంలో తెలంగాణ జనసమితి (టీజేఎస్) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోరుట్ల నియోజకవర్గ పార్టీ ఇంచార్జీ కంతి మోహన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, దుర్గా మాతా కృపతో నియోజకవర్గ ప్రజలకు సిరులు కురిపించాలని వేడుకున్నారు. యువకులు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీజేఎస్ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్, పార్టీ మండల అధ్యక్షులు కంతి రమేష్, పలువురు పార్టీ నాయకులు మరియు మున్నూరు కాపు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుండి పడి వృద్ధుడి మృతి

దండ పెల్లి అక్టోబర్ 16(మనం న్యూస్) : మండలంలోని రెబ్బెనపల్లి గ్రామానికి చెందిన కొట్టే రాజయ్య 65 అనే వృద్ధుడు బతుకమ్మ పూలు సేకరించడానికి వెళ్లి చెట్టు పైనుండి పడి మృతి చెందినట్లు దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగి రాజయ్య పదవి విరమణ అనంతరం తన ప్రోగ్రాంలో ఉంటున్నాడు. ఆదివారం బతుకమ్మ పండుగ కావడంతో కుటుంబ సభ్యులకు పూజ సేకరిస్తారని చెప్పి వెళ్లి గ్రామంలోని టేకు చెట్టు వద్ద పూలు సేకరించినందుకు చెట్టు ఎక్కాడు. ఇదే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి కింద పోయడంతో గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు నవ దుర్గా సేవా సమితి దసరా ఉత్సవాల ఆహ్వానం



మల్లాపూర్ అక్టోబర్, 16(మనం న్యూస్) మల్లాపూర్ మండల కేంద్రం పాత బస్టాండ్ నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం రోజున కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్, వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువాడి నర్సింగరావుకు కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాట్ల సోమయ్య, చింతలూరి రంజిత్, మోర సతీష్, ఉయ్యాల లక్ష్మణ్, సిరిపురం రవీందర్, కోటగిరి ఆనంద్ గౌడ్‌లతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొని ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా కోరారు.

రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మల తొలగింపు

గంగాధర, అక్టోబర్ 16, (మనం న్యూస్):గంగాధర మండలం రంగరావు పల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రహదారికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సర్పంచ్ దాసరి శంకరయ్య తొలగించారు. బతుకమ్మ నిమజ్జనానికి వెళ్లే బైపాస్ రహదారికి ఇరువైపులా చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే గ్రామంలో పాడైపోయిన వీధి లైట్లను తొలగించి, వాటి స్థానంలో నూతన లైట్లను ఏర్పాటు చేశారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా, రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు అందేలా చర్యలు చేపట్టినట్లు పాలకవర్గం తెలిపింది. సద్దుల బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకొని గ్రామ అభివృద్ధికి అవసరమైన పారిశుద్ధ్య, మౌలిక వసతుల మెరుగుదల పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ద్యావ బహదూర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భీమారం మండలంలో నాలుగు వెంచర్లకే అనుమతులు

గ్రీన్ సిటీ డెవలపర్స్ కి అనుమతులు లేవు

రంగుల బ్రోచర్ లతో బురిడీ కొట్టించే దళారులు

ప్రజలకు సమాచారమా.. రియల్ దందాలకు ప్రచారమా?

అనుమతుల్లేని వెంచర్ల బ్రోచర్లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారా?



భీమారం అక్టోబర్ 16(మనం న్యూస్)మండల కేంద్రములో, అలాగే పొలంపెల్లి గ్రామ పంచాయితీలో,దసరా పండుగ గ్రీన్ సిటీ ఇన్ఫ్రా డెవలపర్స్ పేరుతో, ప్లెక్సీలో,అలాగే చరవాణి లలో,బ్రోచర్ లతో,అమాయక జనాలను బురిడీ కొట్టించే పనిలో నిమగ్నమయారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తూ, అక్రమాలపై ప్రశ్నించాల్సిన కొందరి తీరు చర్చనీయాంశంగా మారుతోంది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యతను పక్కనపెట్టి,రియల్ ఎస్టేట్ వెంచర్ల ప్రచారానికి కొందరు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆకర్షణీయమైన బ్రోచర్లు,భారీ హామీలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శల నేపథ్యంలో,ఆయా వెంచర్ల అనుమతులపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది.

బ్రోచర్ రంగులమయం.. అనుమతుల సంగతేంటి?

రంగురంగుల బ్రోచర్లు, విశాలమైన రహదారులు, పార్కులు, పాఠశాలలు, దేవాలయాలు, వాణిజ్య సముదాయాల చిత్రాలు చూపించినంత మాత్రాన వెంచర్‌కు అధికారిక అనుమతులు ఉన్నట్టేనా? భవిష్యత్తులో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ప్రచారం చేస్తే సరిపోతుందా? సంబంధిత అధికారుల నుంచి చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నది ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత లేదా? జీవితకాలం కష్టపడి సంపాదించిన డబ్బుతో సొంతింటి స్థలం కొనుగోలు చేయాలని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆశపడతాయి. అలాంటి వారు ఆకర్షణీయమైన ప్రకటనలు, బ్రోచర్లు చూసి స్థలాలు కొనుగోలు చేసిన తర్వాత అనుమతుల సమస్యలు ఎదురైతే వారి పరిస్థితి ఏమిటి? ప్రజల కష్టార్జితం ప్రమాదంలో పడకుండా ముందుగానే వాస్తవాలు తెలుసుకునే అవకాశం కల్పించాలి.

అనుమతులున్న వెంచర్లు ఇవే.. ఎంపీఓ వివరణ

భీమారం మండలంలోని వెంచర్ల అనుమతుల అంశంపై ఎంపీఓ తెలిపిన వివరాల ప్రకారం, భీమారం గ్రామంలో జయదుర్గ, ఐటీ డి ఏ కాలనీ పక్కన,వెంచర్, అలాగే పొలంపెల్లి గ్రామపంచాయతీ పరిధిలో విహంగా,నీలకంఠ వెంచర్లకు అనుమతులు ఉన్నట్లు ప్రజావాణిలో,ఇచ్చిన వినతి పత్రం దృష్టిలో పెట్టుకొని అధికారులు ఇచ్చిన ఆధారాల సాక్షిగా ఉన్నవి. అయితే, ప్రచారంలో ఉన్న ప్రతి వెంచర్‌కు అనుమతులు ఉన్నాయని భావించడం సరికాదు. పైన పేర్కొన్న బ్రోచర్‌లో చూపించిన వెంచర్‌కు అధికారిక అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలి. బ్రోచర్ ఆధారంగా మాత్రమే అనుమతుల స్థితిని నిర్ధారించలేం. వెంచర్ పేరు, గ్రామం, సర్వే నంబర్లు, ఆమోదిత లేఅవుట్ పత్రాలను పరిశీలించిన తర్వాతే వాస్తవాలు తేలుతాయి.

ప్రచారమేనా? ప్రజలకు జవాబుదారీ ఎక్కడ?

ప్రజల పక్షాన నిలబడి సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన కొందరు వెంచర్ల ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలేమిటో తేలాల్సి ఉంది. ఏదైనా వెంచర్‌ను ప్రచారం చేసే ముందు దాని అనుమతుల వివరాలను పరిశీలించారా? ప్రజలకు చూపిస్తున్న హామీలకు అధికారిక పత్రాల్లో ఆధారాలున్నాయా? ప్రకటనను వార్తగా చూపిస్తున్నారా? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం. పత్రికా రంగం ప్రజల నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. వార్తకు, వ్యాపార ప్రకటనకు మధ్య స్పష్టమైన తేడా ఉండాలి. చెల్లింపు ప్రకటనలు ఉంటే వాటి స్వరూపాన్ని పారదర్శకంగా తెలియజేయాలి.అయితే, ఆధారాలు లేకుండా ఏ ఒక్కరినీ తప్పు చేసినట్లు నిర్ధారించడం సరికాదు. ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి వివరణకు కూడా అవకాశం ఇవ్వాలి.

అధికారులు స్పందించాలి.. అనుమతుల వివరాలు బయటపెట్టాలి

అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు నిర్వహిస్తున్నట్లు అధికారికంగా తేలితే, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రజలు కూడా స్థలం కొనుగోలు చేసే ముందు మోస పూరిత ప్లెక్షిలు, బురిడీ కొట్టించే, కనువింపు కలిగించే బ్రోచర్లు కాదు అని ఆమోదిత లే అవుట్, అనుమతి పత్రాలు,భూమి హక్కులకు సంబంధించిన పత్రాలను పరిశీలించుకోవాలి. అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలి.

అమాయక ప్రజలను కాపాడటం ఎవరి బాధ్యత?

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం తప్పు కాదు. కానీ అనుమతుల విషయంలో పారదర్శకత లేకపోతే, ప్రచారంలో చూపించిన అంశాలకు అధికారిక పత్రాల్లో ఆధారాలు లేకపోతే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వెంచర్ల నిర్వాహకులు, ప్రచారకర్తలు తమ వంతు బాధ్యతగా వాస్తవ వివరాలను వెల్లడించాలి.

భీమారం మండలంలో వెంచర్ల అనుమతులపై నెలకొన్న సందేహాలకు అధికారులు సమాధానం చెప్పాలి. పత్రికా ప్రతినిధులు కూడా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చి,వాస్తవాలను పరిశీలించి వార్తలు అందించాలి. ఆకర్షణీయమైన బ్రోచర్లను చూసి మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి.

ఎంపీఓ వివరణ: భీమారం గ్రామంలో, (1)జయదుర్గ,(2)ఐ టీ డి ఏ క్వాటర్స్ పక్కన వెంచర్లకు,అలాగే పొలంపెల్లి గ్రామపంచాయతీ పరిధిలో విహంగా,నీలకంఠ వెంచర్లకు అనుమతులు ఉన్నట్లు ఎంపీఓ వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు నిర్వహిస్తున్నట్లు తేలితే సంబంధిత నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, అలాగే భీమారం మండలంలో, ఎలాంటి గ్రీన్ సిటీ డెవలపర్స్, కానీ ఇన్ఫ్రా డెవలపర్స్ కానీ, లేవు ఎలాంటి అనుమతులు గ్రామ పంచాయతీ ద్వారా ఇవ్వలేదు. నిబంధనలకు విరుద్ధమైన గ్రీన్ సిటీ డెవలపర్స్ వెలిసినట్టు మా దృష్టికి రాలేదు,వస్తే కనుక చర్యలు తీసుకుంటామని ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే ముందు అనుమతుల వివరాలను, సంబంధిత అధికారులను వివరాలు అడిగి పరిశీలించుకోవాలని సూచించారు.



చిగురుమామిడిలో వరి కోతల కోలాహలం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రైతుల డిమాండ్

వెంటనే కేంద్రాలు తెరవకపోతే దళారుల చేతిలో నష్టపోతాం

ఆవేదనలో అన్నదాతలు



చిగురుమామిడి అక్టోబర్ 16(మనం న్యూస్) : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల వ్యాప్తంగా ఖరీఫ్ వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. గత ఆరు నెలలుగా అహర్నిశలు కష్టపడి పండించిన పంట ఇప్పుడు చేతికందడంతో రైతుల ముఖాల్లో ఎటు చూసినా సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లో హార్వెస్టర్ల శబ్దాలతో మండలం మారుమోగుతోంది. ఈ వానాకాలం సీజన్ లో మండలంలోని 17 గ్రామాల పరిధిలో రైతులు పెద్ద ఎత్తున వరి సాగు చేశారు. మండల వ్యవసాయ అధికారి తాటిపల్లి పూర్ణచందర్ రెడ్డి అందించిన వివరాల ప్రకారం ఈ ఏడాది ఏకంగా 21,517 ఎకరాల్లో వరి పంట సాగు కాగా, 1,288 ఎకరాల్లో పత్తి, 429 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేశారు. వర్షాలు అనుకూలించడంతో పాటు సాగునీరు సకాలంలో అందడంతో ఈసారి దిగుబడి కూడా బాగుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలుకేంద్రాల కోసం ఎదురుచూపులు :

పంట కోతలు మొదలై వారం రోజులు కావస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. కేంద్రాలు ఎప్పుడు ప్రారంభిస్తారు, ఎక్కడ ఏర్పాటు చేస్తారు అనే దానిపై అధికారుల నుండి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాలేదు. దీంతో తాము పండించిన ధాన్యాన్ని ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ కేంద్రాలు ఆలస్యమైతే తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు, దళారులకు కనీస మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “కోతలు పూర్తయ్యాయి, ధాన్యం ఇంటికి తెచ్చుకున్నాం, కానీ కొనే నాథుడే లేడు. వర్షం వస్తే నష్టపోతాం. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి” అని పలు గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి :

రైతులకు నష్టం జరగకుండా ఉండాలంటే మండలంలోని ప్రతి క్లస్టర్ లో ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పచ్చి వడ్ల తేమ శాతంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో కోసిన ధాన్యం తడవకుండా తరలించేందుకు గోదాములు, టార్పాలిన్లు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.